సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 27 । జూలై । 2023



నిండుకుండలా జలాశయాలు
రంపచోడవరం డివిజన్‌లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. 8లో



ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి
గిరిజన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.బి.ఎస్.నంద్ అన్నారు. 8లో



'నాడు-నేడు'పై నిర్లక్ష్యం తగదు
రెండో విడత నాడు-నేడు పనుల పట్ల నిర్లక్ష్యం తగదని జిల్లా వృత్తివిద్య శాఖాధికారి కె. అప్పలరాము హెచ్చరించారు. 8లో

న్యూస్‌రీల్

జెండా కొండపై పర్యాటకుల సందడి



జెండాకొండపై పర్యాటకులు

హుకుంపేట: ఉత్తరాంధ్రలో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొంది, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మపర్వతం (జెండాకొండ)కు బుధవారం పర్యాటకులు తరలి వచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొండ దిగువ ఉన్న ఓలుబెడ్డా గ్రామం నుంచి కాలి నడకన కొండపైకి చేరుకున్నారు. ప్రకృతి అందాలను తిలకించి మధురానుభూతి పొందారు.

నేడు పీఎఫ్ అదాలత్

పాడేరు రూరల్ : ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సమస్యల సత్వర పరిష్కారానికి స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీఎఫ్ అదాలత్ జరుగుతుందని విశాఖ రీజనల్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదాలత్‌కు వచ్చే వారు పీపీవో నంబర్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకురావాలని ఆయన కోరారు.

ఘాట్‌రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు



నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు : సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ధారాలమ్మ తల్లి ఘాట్ రోడ్డులో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటువైపుగా భద్రాచలం నుంచి వస్తున్న బస్సులో ప్రయణికులను ఎక్కించి గమ్యానికి చేర్చారు. బస్సుకు సంబంధించిన బెల్ట్ తెగిపోవడంతో నిలిచిపోయినట్లు గుర్తించారు. విశాఖ నుంచి మెకానిక్ వచ్చి సరి చేసి వెళ్లారు.

పోలీసుల ఏరియా డామినేషన్

కొయ్యూరు: మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు బుధవారం బూదరాళ్ల పంచాయతీలో పలు చోట్ల ఏరియా డామినేషన్ నిర్వహించారు. మర్రివాడ, గుడ్లపల్లితో పాటు పలుచోట్ల వంతెనలను తనిఖీ చేశారు. మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బురదలో దిగిపోయిన అంబులెన్సు

కొయ్యూరు: గర్భిణిని ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు వెళ్లిన యూ.చీడిపాలెం ఆస్పత్రి అంబులెన్స్ ఉల్లిగుంట వద్ద బురదలో చిక్కుకుపోయింది. గర్భిణిని తీసుకువస్తుండగా బురదలో దిగిపోయింది. ఉల్లిగుంట గ్రామస్తులు సాయం చేయడంతో వాహనాన్ని బయటకు తీశారు. గర్భిణిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. భారీ వర్షాలకు రహదారి బురదమయంగా మారడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జాబ్‌మేళా పోస్టర్ విడుదల



జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్

రంపచోడవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ జగదీష్ అడహళ్లి కోరారు. రంపచోడవరం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన మెగా జాబ్ మేళా పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జి. ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండి ఇంటర్, డిప్లమో, డిగ్రీ ,బీటెక్ చదివిన యువత ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 3 గంటల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 6304634447 నంబరులో సంప్రదించాలని కోరారు.

పోటెత్తుతున్న వరద

ఎగువున కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో వాగుల్లో వరదనీరు పోటెత్తి విలీన మండలాల్లో సుమారు 70 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం రాత్రికి గోదావరి నీటిమట్టం రెండవ ప్రమాద హెచ్చరికను దాటే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.



కూనవరం బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి, శబరి నదులు

- పెరుగుతున్న గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు
- పోటెత్తుతున్న వాగులు
- మునిగిన రహదారులు
- 70 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- అప్రమత్తమైన అధికారులు
- సహాయక చర్యలు ముమ్మరం

చింతూరు: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల్లో నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. మంగళవారం నాటికి తగ్గిన ప్రవాహం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం ఒక్కసారిగా పెరిగింది. చింతూరు మండలంలో బుధవారం 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. గోదావరి వరదనీరు ఎటపాక మండలం మురుమూరు వద్ద భద్రాచలం, కూనవరం ప్రధాన రహదారిపై చేరడంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతోపాటు వరదనీరు రహదారులపై చేరడంతో వీఆర్‌పురం మండలంలో 30, కూనవరం మండలంలో ఏడు, ఎటపాక మండలంలో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

శబరి నదికి వరద తాకిడి

ఎగువనున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వరద నీటితో చింతూరు మండలంలో శబరినది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రికి చింతూరు వంతెన వద్ద శబరినది నీటిమట్టం 35 అడుగులకు చేరుకుంది. శబరినది ఉధృతికి చింతూరు మండలంలో పలు వాగులు ఎటపోటుకు గురయ్యాయి. సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగుల వరద రహదారులపైకి చేరడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- కుయిగూరు వద్ద జాతీయ రహదారి–326పైకి వరదనీరు చేరడంతో ఆంధ్రా, ఒడిశా నడుమ, మండలంలోని ఐదు గ్రామాలకు కూడా రాకపోకలు స్తంభించాయి. వరద పరిస్థితి ఇలాఉంటే గురువారం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లకు కూడా రాకపోకలు నిలిచిపోయే అవకాశముంది.

అధికారుల అప్రమత్తం

నాలుగు మండలాల్లో వరద పెరుగుతుండంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుగా వరదముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించిన అధికారులు అక్కడి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచిస్తున్నారు. ప్రజలను తరలించేందుకు నాలుగు మండలాల్లో లాంచీలు, పడవలను సిద్ధంగా ఉంచారు. ప్రమాదకరంగా ఉన్న వాగులు దాటకుండా ఇప్పటికే నాటు పడవల రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

ఎటపాక: వారంరోజులుగా పెరుగుతూ..తగ్గుతున్న గోదావరి నీటిమట్టం బుధవారం మధ్యాహ్నం నుంచి పెరుగుతోంది. రాత్రి 10 గంటలలోపే రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు నీటిమట్టం దాటే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు వెల్లడించారు. ఎగువన ఉన్న తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తాలిపేరు ప్రాజెక్టు నుంచి 22 గేట్లు ఎత్తి తొలిసారిగా రెండు లక్షల క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలో విడుదల చేస్తున్నారు. పాల్వంచ కిన్నెరసాని నది నుంచి కూడా 60 వేల క్యూసెక్కుల వరదను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

- మండలంలోని నెల్లిపాక నుంచి వీరాయిగూడెం వెళ్లే రహదారిపైకి వరద చేరడంతో బొట్లకుంట, నర్సింపేట, వీరాయిగూడెం గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.
- భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే ప్రదాన రహదారిపైకి మురుమూరు వద్ద వరద నీరు చేరింది. తోటపల్లి, నందిగామ, మురుమూరు వాగులు పోటెత్తడంతో పరివాహక ప్రాంతాలు జలమయం అయ్యాయి.


ఎటపాకలో అత్యధిక వర్షపాతం నమోదు

విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా ఎఎస్సార్ జిల్లా ఎటపాకలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం కూడా వర్షాలు కొనసాగనున్నాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గంటకు 45–55 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉండడం వల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.

గోదావరి, శబరి పరవళ్లు

కూనవరం: తుఫాన్ ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తింది. కూనవరం శబరి బ్రిడ్జి వద్ద గోదావరి, శబరి నదులు పరవళ్లతొక్కి ప్రవహిస్తోంది. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపైకి పోలిపాక, మురుమూరు వద్ద వరదనీరు చేరడంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గత వారం రోజుల నుంచి టేకుల బోరు నుంచి కోండ్రాజుపేట రహదారిపై వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రసుతం భద్రాచలం వద్ద రాత్రి ఎనిమిది గంటలకు గోదావరి నీటి మట్టం 47.3 అడుగులు కాగా కూనవరం శబరి, గోదావరి సంగమం వద్ద 18.46 మీటర్లకు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

భూపతిపాలెం గేట్లు ఎత్తివేత



భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



రంపచోడవరం-రంప మధ్య కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలో భూపతిపాలెం ప్రాజెక్టుకు వరద తాకిడి నెలకొంది. దీంతో ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.భూపతిపాలెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్ఆర్ఎల్) 204 మీటర్లు కాగా ప్రస్తుతం 203.90 మీటర్ల వద్ద నీటి మట్టం ఉంది. ఐదు గేట్లు ద్వారా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తివేడయంతో రంపచోడవరం -రంప మధ్య ఉన్న కల్వర్టుపై నుంచి నీరు ప్రవహిస్తుంది. దీంతో రంపచోడవరం- రంప మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



పోలిపాక, మురుమూరు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చేరిన వరద నీరు



చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



మురుమూరు వద్ద కూనవరం ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు



చింతూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న సోకిలేరు వాగు



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

సత్వరమే ఆధార్ కార్డుల జారీ

కలెక్టర్ సుమిత్‌కుమార్



ఆధార్ సిబ్బందికి ఆధార్ మొబైల్ కిట్లను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : జిల్లాలోని మారుమూల గ్రామాల గిరిజనులకు సత్వరమే ఆధార్ కార్డులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. విద్యాశాఖ సౌజన్యంతో కొత్తగా మంజూరు చేసిన 15 ఆధార్ మొబైల్ కిట్లను బుధవారం తన కార్యాలయంలో ఆధార్ మొబైల్ యూనిట్ ఆపరేటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా షెడ్యూల్ వేసుకొని అనంతగిరి నుంచి సీలేరు వరకు మారుమూల గ్రామాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పాడేరు డివిజన్‌లో 34, రంపచోడవరం డివిజన్‌లో 11, చింతూరు డివిజన్‌లో ఐదు ఆధార్ కిట్లు ఉన్నాయని పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్ కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటి వరకు 35 ఆధార్ కిట్లు వినియోగంలో ఉన్నాయని మరో 15 మొబైల్ ఆధార్ కిట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో బ్లూ ట్రీ సొల్యూషన్ రీజనల్ మేనేజర్ డేవిడ్ కమలాకర్, కో ఆర్డినేటర్ల నాగరాజు, డేవిడ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అరకులోయ టౌన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన అరకులోయ, అనంతగిరి బూత్ లెవెల్ అధికారులతో సమావేశమయ్యారు. వచ్చే నెల 21వ తేదీలోగా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అరకులోయలో 12 వేల మంది ఓటర్లు జీరో డోర్ నెంబర్‌తో ఉన్నాయన్నారు. వీటిలో 8వేలు పరిశీలించామని, మరో నాలుగు వేలు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. జగనన్న సురక్ష కింద 3 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో 1.75 లక్షల మేర ధ్రువపత్రాలు పంపిణీ చేశామన్నారు. మిగిలినవి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. భూరీసర్వేకు సంబంధించి మొదటి విడతలో 400 గ్రామాల్లో 210 పూర్తి చేశామన్నారు. రంపచోడవరం పరిధిలోని విలీన మండలాల్లో వరద బాధితులకు వచ్చే నెల రేషన్ ముందుగానే పంపిణీ చేశామన్నారు. ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం అక్కడే ఉండి పనిచేస్తోందన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజుల్లో అధ్యాపక సిబ్బందిని నియమిస్తామని కలెక్టర్ తెలిపారు.

పనితీరు మెరుగుపడకుంటే చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా
- పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



గంపరాయి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల వర్కు బుక్‌ను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

పెదబయలు: ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపడాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. గంపరాయి ఎంపీయూపీ పాఠశాలలో నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో నోట్ పుస్తకాలను కరెక్షన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గసాబు పాఠశాలలో ఇదే పరిస్థితి ఉండడంతో తీవ్రంగా మందలించారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

త్వరితగతిన నాడు–నేడు పనులు

మన బడి నాడు–నేడు పథకంలో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో ఆదేశించారు. పెదబయలు స్కూల్ కాంప్లెక్స్‌లో హెచ్‌ఎం,ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. నాడు- నేడు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజనీర్లు ఇతర అధికారులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు.

80 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరారీ

జి.మాడుగుల: మహారాష్ట్రకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు గంజాయితో కారు పట్టుబడింది. మహారాష్ట్రకు చెందిన మసూద్ ఖాన్ కమల్, షేక్ మహమ్మద్ జమీల్, మరో ఇద్దరు ఆంధ్ర–ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో 80 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. మైదాన ప్రాంతానికి కారులో తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. నలుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా మిగతా ఇద్దరు పరారైనట్టు ఆయన చెప్పారు. పట్టుబడిన వారి నుంచి గంజాయితోపాటు కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: టీటీడీ ఆలయ నిర్మాణానికి మండలంలోని జైపూర్ జంక్షన్ వద్ద బుధవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్థల పరిశీలన చేశారు. ఈ స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని తహసీల్దార్ నాగమ్మను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ బుజిబ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత జాగ్రత్తలతో క్షయ నివారణ

- జిల్లా అధికారి విశ్వేశ్వరనాయుడు

పెదబయలు: వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మారుమూల గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు తీరును పరిశీలించారు. రోజువారీ ఓపీ, ఇతర పరీక్షల వివరాలను పరిశీలించారు. క్షయ, కుష్టు, మలేరియా కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అంతకుముందు జి.మాడుగుల మండలం బొయితిల హెల్త్ వెల్నెస్ సెంటర్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ కిరణ్. చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి


- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- సంపంగి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో అభిషేక్

డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలో ప్రధాన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. మండలంలోని కించుమండ సమీపంలోని సంపంగి గెడ్డపై రూ.4.40 కోట్లతో నిర్మించనున్న కాజ్‌వే నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాను సమయంలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని పునరుద్ధరించడంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గిరిజన ప్రాంతంలో లోగేలి, కంద్రుం, సంపంగి గెడ్డలపై బ్రిడ్జిల నిర్మాణం చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. టీడబ్ల్యూఈఈ వేణుగోపాల్, డీఈ సుబ్బారావు, జేఈ అభిషేక్, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీటీసీలు విజయ, వరహాలమ్మ,దేవి, భీమరాజు, సర్పంచ్‌లు సుబ్బారావు, చెల్లమ్మ, వెంకట్రావు, నాగేశ్వరరావు, అర్జున్, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, మహిళ అధ్యక్షురాలు శాంతి, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ పాల్గొన్నారు. ఇలావుండగా మండలంలోని చెల్లమ్మవలస, చంపపట్టి బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆ ప్రాంతీయులు వినతిపత్రం అందజేశారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



రాజు మృతదేహం (ఇన్‌సెట్) రాజు(ఫైల్)



మృతి చెందిన పశువులు

అరకులోయ రూరల్: పిడుగుపాటుకు పశువుల కాపరితోపాటు నాలుగు పశువులు మృతి చెందాయి. మండలంలోని మాదల పంచాయతీ బొర్రిగూడ గ్రామానికి చెందిన గుబాయి రాజు(50) బుధవారం పశువుల కాపలా నిమిత్తం గ్రామ సమీపంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఈ సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతంలో మరో నాలుగు పశువులు మృతి చెందాయి. వీటిలో మృతుడికి చెందినవని రెండు, అదే గ్రామానికి చెందిన వంతాల గురుకు చెందిన రెండు పశువులు ఉన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతి చెందిన పశువుల విలువ రూ.1.6లక్షల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఎంపీటీసీ రాంచందర్, సచివాలయం కన్వీనర్లు శెట్టి గోపాల్, సన్యాసిరావు, గురుమూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సర్వీసు వైరు తగిలి ప్రమాదం



సత్తిబాబు మృతదేహం

అడ్డతీగల: మండలంలోని భీముడుపాకలలో బుధవారం విద్యుత్ షాక్ వల్ల నేటుల సత్తిబాబు(29) అనే యువకుడు మృతి చెందాడు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సత్తిబాబు పెంకుటిల్లు పైకప్పు నుంచి వర్షం నీరు లీకై ఇంట్లోకి వచ్చేస్తోంది. లీకేజీలు అరికట్టేందుకు బుధవారం సత్తిబాబు ఇంటి పైకప్పుపైకి ఎక్కి టార్పాలిన్ కట్టేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో విద్యుత్ సర్వీసు వైర్ తగిలి షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. చికిత్స అందించే లోపు మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన అరకు ఎంపీ మాధవి


మంత్రి ఆశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ మాధవి

కొయ్యూరు: అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెల్ టవర్లను త్వరితగతిన పూర్తి చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి బుధవారం కేంద్ర రైల్వే, కమ్యూనికేషన్ మంత్రి ఆశిని శ్రీ వైష్ణవ్‌ను ఢిల్లీ పార్లమెంట్ హాలులో కలిసి వినతిపత్రం ఇచ్చారు. రెండువేలకు పైగా నెట్‌వర్క్ టవర్లు మంజూరయ్యాయని, వాటిని పూర్తి చేస్తే గిరిజనులకు అన్ని విధాల సేవలు మెరుగుపడతాయన్నారు. ప్రస్తుతం కమ్యూనికేషన్‌పై అంతా ఆధారపడి ఉందని తెలిపారు.వాటి మూలంగా సంక్షేమ పథకాలు వేగంగా మారుమూల ప్రాంతాల్లో లబ్ధిదారులకు చేరుతాయన్నారు.పలు గిరిజన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.దీని అనంతరం ఆమె షెడ్యూల్ కులాలు, తెగల సంక్షేమంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు

ఉత్తమ సేవలకు గుర్తింపు

● రాంకీ ఫౌండేషన్, నాబార్డుకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్, హరికృష్ణలు

కొయ్యూరు: రాంకీ ఫౌండేషన్, నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా తోట ప్రాజెక్ట్‌కు ప్రతిభా అవార్డు దక్కింది. బుధవారం విజయవాడలో నిర్వహించిన నాబార్డు 42వ ఏర్పాటు దినోత్సవం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాంకీ ఫౌండేషన్‌కు చెందిన డిప్యూటీ చీఫ్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ హరికృష్ణలు అవార్డును అందుకున్నారు. నాబార్డు ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ ఐదు సంవత్సరాల నుంచి రైతులకు అవసరమైన వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసి వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డును అందజేశారు. దీనిలో మా తోట కమిటీ కార్యదర్శి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నంద్


చోటముఖిపుట్టులో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖాధికారులు, రైతులు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.బి.ఎస్.నంద్ అన్నారు. మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ చోటముఖిపుట్టు లో బుధవారం గిరిజన రైతులు పంట పోలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అధికారులు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నంద్, పాడేరు ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేతలు పాల్గొని నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి నారు ఉడిచే ముందు నారు చిగుర్ల కత్తిరింపు, సూడోమోనాస్ జీవన ఎరువుల ఉపయోగం, పురుగుల మందుల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి నంద్ మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తే సాగు ఖర్చు తగ్గి,ఆదాయం పెరుగుతుందన్నారు. ఆధునిక పద్ధతులు తెలుసుకోవాలన్నారు. వరి పంట అగ్గి తెగులు సోకకుండా వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు 250 గ్రాముల సూడోమోనాస్ పొడిని 100 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయంపై పూర్తిగా దృష్టి పెట్టాలని అన్నారు. పాడేరు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ జె.జగనాథ్ధం, శాస్త్రవేత జి.చిట్టిబాబు, డీఆర్‌సీ వ్యవసాయాధికారి విజయలక్ష్మి, ఏవో ఎం.శ్రీనివాస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా వరి సాగు

పెదబయలు: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా వరి సాగు చేపట్టినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నంద్ అన్నారు.బుధవారం పెదబయలు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం.రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1.62 లక్షల మంది రైతులకు రైతు భరోసా రూ.102 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని, పీఎం కిసాన్ పథకంలో మరో రూ. 20 కోట్ల రైతులు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందన్నారు. వరితో పాటుగా రాగులు, జొన్న, వేరుశెనగ ఇతర పంటలు కూడా విస్తారంగా సాగులో ఉన్నట్టు చెప్పారు. జిల్లాలోని చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో భారీ వర్షాల వల్ల ఎగువ నుంచి వచ్చే వరదల వల్ల ఇంకా వరి నాట్లు పడలేదన్నారు. అడ్డతీగల ప్రాంతంలో వరి నాటు వేశారన్నారు. జిల్లాలో 18వేల క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందించామన్నారు. కౌలు రైతులు సాగులో ఉన్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

విస్తరిస్తున్న డ్రోన్ వ్యవస్థ.. పెరుగుతున్న ఉపాధి

జిల్లాలో డ్రోన్ పైలట్ శిక్షణ కోసం అర్హత కలిగిన నిరుద్యోగులు మండల వ్యవసాయ అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నంద్ అన్నారు. ప్రస్తుతం డ్రోన్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, ఫోటోగ్రఫీ నుంచి వాతావరణ పరిశోధన వరకు డ్రోన్ వ్యవస్థ పనులు నిర్వహిస్తుందన్నారు. రానున్న రోజుల్లో డ్రోన్ పైలట్లకు డిమాండ్ పెరుగుతుందని, డ్రోన్ ఆపరేటింగ్‌కు శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. సబ్సిడీ ద్వారా రూ.10 లక్షలు విలువైన డ్రోన్ అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లాలో 20 డ్రోన్ పైలట్ యూనిట్లు ఉన్నాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఏవో ఏ.శ్రీనివాస్,వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల విలువైన గంజాయి పట్టివేత

నిందితుడి అరెస్టు, బొలేరో వాహనం స్వాధీనం


పట్టుకున్న గంజాయి, నిందితుడితో సీఐ సత్యనారాయణ,ఎస్ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది

ముంచంగిపుట్టు : మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు గంజాయి రవాణాకు ఉపయోగించిన బొలేరో వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారంతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేస్తుండగా బరడ నుంచి లబ్బూరు జంక్షన్ వైపు వస్తున్న బొలెరో వాహనం నిలుపుదల చేసి అందులో ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పోలీసులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరు పోలీసులకు పట్టుబడగా మరొకరు తప్పించుకున్నాడు. వాహనం తనిఖీ చేయగా 10 బస్తాలలో ఉన్న గంజాయిని గుర్తించారు. గంజాయిని, బొలెరోను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 200 కిలోలు ఉందని, దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ లబడపుట్టు గ్రామానికి చెందిన వంతాల హరిగా గుర్తించామని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సత్యనారాయణ తెలిపారు. పరారైన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఎస్ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన మూఢ నమ్మకం

- మహిళ అనుమానాస్పద మృతి కేసులో పురోగతి
- చెడుపు అనుమానంతో హత్య చేసినట్టు నిర్ధారణ
- ఇద్దరికి రిమాండ్


ఇద్దరు నిందితులతో పోలీసులు

కొయ్యూరు : కంప్యూటర్ యుగంలోను మూఢ నమ్మకాలు పోవడం లేదు. తాజాగా అనుమానాస్పద మృతి కేసు చివరకు హత్యగా నిర్ధారణ అయింది. చెడుపు అనుమానంతో మహిళను చంపిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వాటి వివరాలను సీఐ స్వామినాయుడు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో నల్లబిల్లికి చెందిన పాంగి రస్కో అనుమానాస్పదంగా గ్రామం సమీపంలో మరణించింది. దీనిపై కుటుంబ సభ్యులు ఎవరో కావాలని చంపేశారని, విచారణ చేయాలని పోలీసులను కోరారు. దీనిపై సీఐ స్వామినాయుడు, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ విచారణ చేపట్టారు. రస్కో హత్యకు మూఢ నమ్మకం కారణంగా నిర్ధారించారు. నల్లబిల్లికి చెందిన పాంగి లక్ష్మణరావు, సీందరి అప్పారావు కలిసి రస్కోను హత్య చేశారని తేలింది. దీంతో నిందితులను పట్టుకోవడానికి పోలీసులు అనేక చోట్ల గాలించారు. చివరకు వారు బూదరాళ్ల వీఆర్‌వో పూజారి గంగాధర్ ఇంటి వద్ద ఉన్నట్టుగా తెలుసుకున్నారు. పోలీసులను చూడగానే నిందితులు ఇద్దరూ లొంగిపోయారని సీఐ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

చేతబడి నెపంతో మహిళ హత్య..!

మారేడుమిల్లి : చేతబడి చేస్తుందనే నెపంతో ఓ గిరిజన మహిళను హత్య చేసినట్టు తెలిసింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చావడికోట పంచాయతీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన ఓ మహిళ చేతబడి చేస్తుందని అనుమానంతో అదే గ్రామంలోని కొంత మంది తాడుతో ఆమె గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్టు తెలిసింది. మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జగనన్న సురక్షతో పేదలకు రక్ష


తాడిపుట్టులో ధ్రువపత్రాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో పేదలకు రక్ష అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని తాడిపుట్టు సచివాలయ కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో 449 మందికి మంజూరైన వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతు గిరిజనులు ఏ విధమైన సమస్యలతో ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మట్టుజోరు సచివాలయంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం పాల్గొని 189 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవో పీఆర్డీ అశోక్, డీటీ రంగారావు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, యువజన విభాగ జిల్లా కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు సాంభ, సత్యవతి, ఎంపీటీసీలు సింహాచలం, భీమలింగేశ్వరరావు, సుశీల, నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'పై నిర్లక్ష్యం తగదు

● జిల్లా వృత్తివిద్య శాఖాధికారి

సీలేరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వృత్తి విద్య శాఖాధికారి కె. అప్పలరాము హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 20 జూనియర్ కళాశాలల్లో రెండో విడత జరుగుతున్న నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

హుకుంపేట/చోడవరం రూరల్ : పెళ్ళయి ఏళ్ల గడుస్తున్నా సంతానం కలగక పోవడంతో కట్టుకున్న భర్త, అత్త మామలు వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైన గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన భర్తకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ తీర్పు చెప్పారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు, హుకుంపేట ఎస్ఐ సతీష్ వేర్వేరుగా తెలిపిన వివరాలివి. హుకుంపేటకు చెందిన పడమట మాధవికి లక్ష్మణరావుతో అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నక్కలపాలెంలో 2015 మే 5వ తేదీన వివాహం జరిగింది. కొన్నేళ్లు వారి కాపురం సజావుగానే సాగింది. అయితే సంతానం కలగకపోవడంతో భర్తతో పాటు కుటుంబ సభ్యుల నుంచి మాధవికి వేధింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 2021 ఫిబ్రవరి 9న భర్త, కుటుంబ సభ్యుల వేధింపులకు తట్టుకోలేక హుకుంపేటలోని తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన మాధవి ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో మాధవి భర్త పడమట లక్ష్మణరావు, మామ తిరుపతి గుప్తా, అత్త కన్నాకుమారి, చిన మామ సత్యనారాయణ, వారి బంధువు ఉడా శ్రీనివాసరావులు ప్రతి రోజు తన కుమార్తె మాధవిని గొడ్రాలివని, నువ్వు వెళ్లిపోతే భర్త లక్ష్మణరావుకు వేరే వివాహం చేస్తామని వేధింపులకు పాల్పడడం వల్లే తన కుమార్తె మృతి చెందిందని మృతురాలి తండ్రి కామరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాడేరు సీఐ సుధాకర్ కేసు దర్యాప్తు నిర్వహించి నిందితులు ఐదుగురిపై ఐపీసీ 306,498ఎ రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కోర్టులో ఛార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టులో విచారణ అనంతరం ప్రధాన నిందితుడు మృతురాలి భర్త లక్ష్మణరావుకు ఏడేళ్ళ జైలు శిక్షతో పాటు రెండు వేలు నగదు జరిమాన విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు వారాల జైలు శిక్షను విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఇతర నిందితులపై మోపిన నేరం రుజువు కానందున వారిని నిర్దోషులుగా పేర్కొంటూ వారికి విముక్తి కలిగించారు.

జాబ్‌మేళాను విజయవంతం చేయండి


మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: రంపచోడవరం డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 28న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గోడపత్రికను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం ఎల్లవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకూ నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో 10 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఇంటర్,డిప్లమో,డిగ్రీ,బిటెక్ ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్ : విద్యార్థిని అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. సీఐ దాడి మోహనరావు తెలిపిన వివరాలివి. తుమ్మపాల గ్రామానికి చెందిన 19 ఏళ్ల వయసు గల విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల్లో డిగ్రీ చదువుతోంది. ఆమె బుధవారం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ తెలియకపోవడతో తల్లి భవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

నిండుకుండలా జలాశయాలు


వట్టిగెడ్డ జలాశయంలో వరదనీరు



ప్రధాన కాలువలో పూడికతీత పనులు

రాజవొమ్మంగి: చిన్నేరు, పెద్దేరు కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వట్టిగెడ్డ రిజర్వాయర్ పూర్తిగా నిండిపోయింది. అదనపు నీరు పొర్లు కట్టుపై నుంచి పొర్లుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 16 అడుగులు కాగా అంతకు మించి వర్షపునీరు వచ్చి చేరడంతో మిగులు జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి స్థానికంగా 41.2 ఎంఎం వర్షం కురిసింది. దీంతో మండలంలోని మడేరు ఆనకట్ట కూడా పొంగి ప్రవహిస్తూ జలాలు ఏలేశ్వరంలోని ఏలేరు వైపు ప్రవహిస్తున్నాయి. రైతులు ఖరీఫ్ పనులకు సిద్ధపడుతున్నారు.

సూరంపాలెంకు జలకళ

గంగవరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సూరంపాలెం జలాశయంలోకి భారీగా వరదనీరు చేరుతోంది. గరిష్ట నీటిమట్టం 105 మీటర్లు కాగా ఇప్పటికే 104.05 మీటర్లకు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గంగవరం, గోకవరం, కోరుకొండ మండలాల్లో 10 వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతుంది. జలాశయ నీటిమట్టం 105 మీటర్లకు మించితే గేట్లు ఎత్తి వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఏఈ ప్రసాద్‌రాజు తెలిపారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

మెరుగైన వైద్య సేవలందించాలి


సమావేశంలో పాల్గొన్న ఎన్‌క్యూఎఎస్ నేషనల్ అసోసర్స్ బృంద సభ్యులు

జి.మాడుగుల: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల ఢిల్లీకు చెందిన నేషనల్ హెల్త్ రీచర్స్ సెంటర్ (ఎన్‌క్యూఎఎస్ నేషనల్ అసోసర్స్) నుండి వచ్చిన వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. స్థానిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ, సదుపాయాలు, వైద్య సిబ్బంది పనితీరును గూర్చి రెండో రోజు బుధవారం సమీక్షించింది. రికార్డులు పరిశీలించారు.

రోగులకు అందుత్ను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పనితీరు, వైద్య సిబ్బంది సేవలు గూర్చి వైద్య బృందం డాక్టర్ ఆర్ ఇలంగోవన్, డాక్టర్ నిమిత్, డాక్టర్ కుబావత్‌లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వస్తున్న వైద్య సిబ్బంది తమ విధుల పట్ల అలసత్వం వహించవద్దని, విధులు నిర్వహించే పద్ధతులు, విధానాలు గూర్చి వివరించారు.

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని, విధులు నిర్వహించే డాక్టర్లు, వైద్య సిబ్బందిని వారు అభినందించారు. వైద్య బృందానికి చెందిన మహిళా డాక్టర్ కుబావత్‌ని సిబ్బంది మర్యాదపూర్వకంగా అభినందించారు. వైద్యాధికారులు డాక్టర్ శశికాంత్, డాక్టర్ రవిచంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ఎస్. ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు

పాడేరు రూరల్ : మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో బుధవారం వలంటీర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం టీడీపీ, జనసేన, బీజేపీ తదితర పార్టీలు గ్రామ వలంటీర్లపై చౌకబారు ఆరోణలు మానుకోవాలని, దిగజారుడు రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి గడపకు ప్రభుత్వ సేవలందిస్తున్నారన్నారు.

దీంతో ప్రభుత్వం, గ్రామ వలంటీర్లకు వస్తున్న ప్రజా మన్ననలను తట్టుకోలేక ప్రతిపక్షాలు తమ రాజకీయ మనుగడ కోసం గ్రామ వలంటీర్లను కించపరిచేలా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు వంతాల కొండమ్మ మాట్లాడుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదన్నారు. తమ ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, నాయకులు వసంతరాణి, కుర్మారాజు, దేవా, గిరి, కరుణాకర్, చిన్నయ్య, శోభన్, ప్రసన్న, హను, పాడి గిరి, బుక్కా మోహన్, తదితరులు పాల్గొన్నారు.